# ఏడేళ్లుగా రుణాలు ఇవ్వడం లేదు

**పంట సాగు చేసేదెలా !**

**సొసైటీ సర్వసభ్య సమావేశంలో రైతుల ఆందోళన**

**పెద్దేముల్,మార్చి 31, ప్రభాతవార్త:** గత ఏడు సంవత్సరాల నుంచి అసైన్డ్ భూములపై పంట రుణాలు ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇన్నాళ్ళు అసైన్డ్ భూములపై పంట రుణాలు ఇచ్చిన వాటిని సక్రమంగా ఉపయోగం చేసుకొని తిరిగి బాకీ చెల్లించామని, 2018 నుంచి అట్టి భూములపై పంట రుణాలు ఇవ్వకుంటే తమ పరిస్థితి ఎలా అని రైతులు సర్వసభ్య సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సిఎస్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాస్ సంగారెడ్డి మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘ అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. సంఘ అభివృద్ధికి రైతుల సహకారం తప్పనిసరి అవసరమని అన్నారు. ఇంతలో రైతు దుగ్గాపూర్ శ్రీనివాస్ తదితరులు కల్పించుకొని మాట్లాడుతూ 2018 డిసెంబర్ నుంచి అసైన్డ్ భూములపై పంట రుణాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సొసైటి పరిధిలో సుమారు 500 పై చిలుకు ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, అట్టి భూములపై పంట రుణాలు ఇవ్వకుంటే 320 మంది రైతుల పరిస్థితి ఏందని ఆందోళన వ్యక్తంచేశారు. మార్టిగేజ్ అయితేనే రుణాలు ఇస్తామని,లేకుంటే ఇవ్వమని బ్యాంకు అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధరణి వచ్చినప్పటి నుంచి మార్టిగేజ్ కావడంలేదని, అందుకు రైతులు చేసిన తప్పేంటని ఆవేదన వ్యక్తంచేశారు.


ప్రశ్నిస్తున్న రైతు

మార్టిగేజ్ పేరిట బ్యాంకు అధికారులు కొర్రిలు పెడుతురైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, అసైన్డ్ భూములపై పంట రుణాలు ఇచ్చేలా ప్రజాప్రతినిధులు, సంబందిత అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్సన్ ఇంచార్జ్ సురేష్, మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్, సొసైటి మేనేజర్ మురళిగౌడ్, సిబ్బంది ఫయాజ్, పెంటప్ప, ప్రవీన్‌కుమార్, నర్సిములు, మాణెప్ప ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# దారి మళ్లిన.. సహకారం



బషీరాబాద్‌లో విద్యుత్ కనెక్షన్ లేక నిరుపయోగంగా ఉన్న రైస్‌మిల్

**నీరుగారిన సొసైటీ రైస్ మిల్లుల లక్ష్యం -జిల్లాలో 11 మిల్లులకు రూ.22 కోట్లు మంజూరు - యాలాలలో పనులు పూర్తిచేసినా రెండేళ్లుగా బిల్లుల మంజూరుకు బ్రేక్ కాంట్రాక్టర్‌పై రూ.2 కోట్ల రుణభారం - బషీరాబాద్‌లో రైస్ మిల్లు సిద్ధమైనా టాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో జాప్యం - తుప్పుపడుతున్న యంత్రాలు - శివారెడ్డిపేటలో కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన నిధులు సొసైటీ ఖాతాలోకి మళ్లింపు? - రైస్ మిల్లు స్కామ్‌పై విచారణ నత్తనడక - డిసిసిబి అండదండలే కారణమా?**

**వికారాబాద్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రైస్ మిల్లుల నిర్మాణం భారీ కుంభకోణానికి వేదికైంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరకముందే కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్లుగా మిల్లులు నిరుపయోగంగా ఉన్నా, ఉన్నతాధికారులు విచారణలో జాప్యం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది.**

**(వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త)** రైతులు పండించిన ధాన్యాన్ని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సహకార సంఘాల ద్వారానే మిల్లింగ్ చేయించి, వారికి లాభదాయకమైన ధర కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం కొన్ని సొసైటీల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. గ్రామాల్లోని రైతులు తమ పంటను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా, స్థానికంగానే తక్కువ రవాణా ఖర్చుతో మిల్లింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో వికారాబాద్ జిల్లాలో 11 మిల్లులను మంజూరు చేసినప్పటికీ పలు చోట్ల అవి అలంకారప్రాయంగా మారాయి. దీంతో స్థానిక గ్రామీణ యువతకు ఈ రైస్ మిల్లుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్న సర్కారు సంకల్పానికి గండి పడింది. మరోవైపు సొసైటీలు కేవలం రుణాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, వ్యాపార లావాదేవీలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాల్సిన నేపథ్యంలో అక్కడక్కాడా మిల్లుల ఏర్పాటుకు మంజూరైన నిధులే మిల్లింగ్ అయిపోయాయి.

ప్రభుత్వం సేకరించే ధాన్యాన్ని వెనువెంటనే మిల్లింగ్ చేసి బియ్యంగా మార్చడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రజా పంపిణీ వ్యవస్థకు త్వరగా బియ్యాన్ని సరఫరా చేయాలన్న ప్రయత్నాలకూ ఆదిలోనే హంసపాదు పడింది.

**రెండేళ్లుగా బిల్లులు రాక..**

రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా పరిధిలోని 11 సహకార సంఘాలకు రైస్ మిల్లులు మంజూరయ్యాయి. ఒక్కో మిల్లు నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్ల చొప్పున మొత్తం రూ. 22 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం వెచ్చించింది. నిర్మాణ సంస్థలు దాదాపు అన్ని చోట్లా పనులను పూర్తి చేశాయి.

అయితే, ఈ మిల్లులు ప్రారంభమై రైతులకు సేవలు అందించాల్సింది పోయి, అధికారుల నిర్లక్ష్యం వల్ల తుప్పు పడుతున్నాయి. పనులు పూర్తి చేసినా రెండేళ్లుగా బిల్లులు రాక, అన్యాయాన్ని ప్రశ్నించలేని స్థితిలో రాయలసీమకు చెందిన ఒక యువ కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది.

**యంత్రాలు ఉన్నాయి.. కరెంటు లేదు**

బషీరాబాద్‌లో రైస్ మిల్లు సిద్ధమైంది. యంత్రాలు అమర్చినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. రూ. 25 లక్షల అంచనా వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. కార్యరూపం దాల్చలేదు. దీంతో రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. దీని కోసం మళ్లీ కొత్త కాంట్రాక్టరును వెతకడం వెనుక పెద్ద మతలబే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**డిసిసిబి అండదండలు?**

యాలాల రైస్ మిల్లు స్కామ్‌పై విచారణ జరుగుతున్నా, అది నత్తనడకన సాగడం గమనార్హం. మిగిలిన సొసైటీల్లోని అక్రమాలపై ఉన్నతాధికారులు కనీసం దృష్టి సారించకపోవడం అనేక సందేహాలకు దారితీస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) అధికారుల పాత్రపై కూడా ఆరోపణలు వస్తున్నాయి.

**శివారెడ్డిపేటలో విచిత్రం**

ఇక్కడ మిల్లు పనులు పూర్తయినా, నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించలేదు. కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన నిధులు నిబంధనలకు విరుద్ధంగా సొసైటీ ఖాతాలోకి మళ్లించారని తెలుస్తోంది. యాలాల యంత్రాలకు, బషీరాబాద్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఈ బిల్లులు ముడిపెట్టినట్లు తెలుస్తోంది.

ఒకవైపు మిల్లుల నిర్మాణం కోసం అప్పులు చేసి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక కన్నీరు మున్నీరవుతుంటే, మరోవైపు సొసైటీ అధికారులు ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తూ కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ రైస్ మిల్లు స్కామ్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

**ప్రజా సంఘాల డిమాండ్**

చిన్న పొరపాట్లకే కఠిన చర్యలు తీసుకునే ప్రభుత్వం, కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా ఎందుకు మౌనంగా ఉందని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. రైస్ మిల్లుల కుంభకోణంపై విచారణ పేరుతో కాలయాపన చేస్తున్న అధికారులు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# కాలయముడు

**మద్యం మత్తులో మారణకాండ!**

**కుటుంబ సభ్యులపై రోకటి బండ, కత్తితో దాడి**

**అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన భార్య, కుమారుడు**

**మృత్యువుతో పోరాడుతున్న కుమార్తె**

**పోలీసుల అదుపులో నిందితుడు రాందాస్ నాయక్**


కసాయి భర్త దాడిలో విగత జీవులుగా మారిన భార్య, కుమారుడు

**ఆమనగల్లు, మార్చి 31, ప్రభాతవార్త:** మద్యం రక్కసి మరో సంసారాన్ని చిదిమేసింది. కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి, మద్యం మత్తులో కసాయిలా మారి వారిపైనే మృత్యుపాశం విసిరాడు. విచక్షణా రహితంగా చేసిన దాడిలో భార్య, కుమారుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కుమార్తె ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న హృదయ విదారక ఘటన ఆమనగల్లు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆమనగల్లు మండలం సీతారాం నగర్ పంచాయతీ పరిధిలోని పులిగోనిపల్లి తండాకు చెందిన బాణావత్ రాందాస్ నాయక్ స్థానిక పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య కవిత, ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ సంతానం ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటుండగా, కుమారుడు హర్షిత్ (5), కుమార్తె ప్రణీత (10) ఇంట్లోనే ఉంటున్నారు. రాందాస్‌కు మద్యపానం అలవాటు ఉండటంతో తరచూ భార్యతో గొడవ పడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రాందాస్, భార్య కవితతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో ఊగిపోయిన అతను, ఇంట్లో ఉన్న రోకలిబండ మరియు కత్తితో భార్య కవిత, కుమారుడు హర్షిత్, కుమార్తె ప్రణీతలపై విచక్షణా రహితంగా దాడి చేశాడు.

**చెల్లాచెదురైన కుటుంబం**

ఈ దాడిలో తల పగిలి భార్య కవిత, కుమారుడు హర్షిత్ రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. తీవ్ర గాయాలపాలైన కుమార్తె ప్రణీతను మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. అప్పటివరకు కళకళలాడిన ఆ ఇల్లు శవాల దిబ్బగా మారడం చూసి స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**పోలీసుల విచారణ**

విషయం తెలిసిన వెంటనే ఆమనగల్లు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక ఏసిపి జానకిరెడ్డి, ఎసీహెచ్ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించి, నిందితుడు రాందాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరిస్తోంది. మానవత్వాన్ని మంటగలిపిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఆధార్ తరహాలో భూధార్



**-రేపటి నుండి భూ భారతి పోర్టల్ శ్రీకారం**

**-పైలెట్ ప్రాజెక్టుగా ఆమనగల్లు మండలం ఎంపిక**

**-భూ రికార్డుల ప్రక్షాళనకు సరికొత్త అస్త్రం!..**

**-సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్నీ డిజిటల్**

**-ప్రతి కమతానికి భూధార్.. ఒకే క్లిక్‌తో పూర్తి జాతకం**

**-మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శక సేవలు**

**రంగారెడ్డి అర్బన్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం మరో విప్లవాత్మక అడుగు వేసింది. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఒకే గొడుగు కిందకు తెస్తూ, అత్యంత పారదర్శకమైన సమీకృత భూ భారతి పోర్టల్‌ను ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి తీసుకురాబోతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు జిల్లాలోని ఆమనగల్లు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది.

**నాలుగు విభాగాలు ఒకే వేదిక..**

ఇప్పటివరకు భూములకు సంబంధించి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఎన్ఐసీ విభాగాలు విడివిడిగా పనిచేసేవి. దీనివల్ల డేటా సమన్వయం లోపించి సామాన్యులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇకపై ఈ నాలుగు విభాగాలను ఏకం చేస్తూ భూ భారతి పోర్టల్‌ను రూపొందించారు. ఈ పోర్టల్ ద్వారా భూ యజమాని తన ఆధార్ అనుసంధాన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఇంటి నుండే తన భూమి వివరాలను చూసుకోవచ్చు.

**ప్రతి సర్వే నంబర్‌కు గుర్తింపు**

ఈ వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం భూధార్ ప్రతి సర్వే నంబర్‌కు లేదా కమతానికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఖచ్చితమైన హద్దులు, జీపీఎస్ ఆధారిత సర్వే ద్వారా భూమి సరిహద్దులను పక్కాగా నిర్ధారిస్తారు. డిజిటల్ మ్యాప్ ప్రతి కమతానికి సంబంధించిన మ్యాప్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. వివరాల లభ్యత భూమి స్వభావం (పట్టా, ప్రభుత్వ, అటవీ, అసైన్డ్, లావణి, భూదాన్, వక్ఫ్)తో పాటు యజమాని పేరు, విస్తీర్ణం వంటి 36 రకాల మాడ్యూల్స్ ఈ పోర్టల్‌లో పొందుపరిచారు.

**ఆమనగల్లు నుంచే ప్రయోగం**

ఆమనగల్లు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలో 13 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీ ఉంది. ఇక్కడి భూ సమస్యలు ఇలా ఉన్నాయి. పలు సందర్భాలలో వచ్చిన దరఖాస్తులు 6,595 కాగా.. 3,089 సమస్యలు పరిష్కారమయ్యాయి.

2,536 దరఖాస్తులు పలు కారణాల వల్ల తిరస్కారమయ్యాయి. ప్రస్తుతం 275 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో తహసీల్దార్ కార్యాలయంలో 149, ఆర్డీఓ వద్ద 25, అదనపు కలెక్టర్ వద్ద 71, కలెక్టర్ కార్యాలయంలో 30 పెండింగ్‌లో ఉన్నాయి.

**అవినీతికి అడ్డుకట్ట.. సామాన్యుడికి ఊరట..**

ప్రస్తుత వ్యవస్థలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, సామాన్యులు కలెక్టరేట్ల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నారు. క్షేత్రస్థాయి అధికారుల అలసత్వం, సిఫార్సుల ప్రభావం, కొందరు అధికారుల అవినీతి వల్ల అసలైన బాధితులకు న్యాయం జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూ భారతి అమల్లోకి వస్తే హద్దుల వివాదాలు, సర్వే నంబర్ల వారీగా హద్దులు నిర్ధారించడం వల్ల పొరుగు భూముల యజమానుల మధ్య ఘర్షణలు తప్పుతాయి. రికార్డుల భద్రత రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుంది. సులభతర సేవలు కరెక్షన్, అప్పీల్, రిజిస్ట్రేషన్, సిటిజన్ డ్యాష్ బోర్డు సేవలు ఒకే చోట లభిస్తాయి.

**దశలవారీగా జిల్లా మొత్తం అమలు**

ఆమనగల్లులో ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, ప్రభుత్వం దీనిని దశలవారీగా జిల్లా మొత్తం అమలు చేయనుంది. భూ సమస్యల పరిష్కారంలో ఈ పోర్టల్ ఒక నూతన శకానికి నాంది పలుకుతుందని నిపుణులు భావిస్తున్నారు.

## కొడంగల్‌కు ధీటుగా

# వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తా

**నిష్ణాతులతో కౌన్సిలర్లకు అవగాహన కల్పిస్తాం**

**మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్**



మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, ప్రభాతవార్త :** కోడంగల్ కు ధీటుగా వికారాబాద్ ను అభివృద్ధి పరుస్తానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ గడ్డం అనన్య అధ్యక్షతన వికారాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై మాట్లాడారు. బడ్జెట్ విషయాలపై అవగాహన కోసం కొత్తగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులకు త్వరలోనే నిష్ణాతులైన వారిచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గతంలో తాను మంత్రి గా ఉన్న సమయంలో కేంద్ర మంత్రి స్వర్గీయ జైపాల్ రెడ్డి తో మాట్లాడి రూ.2,300 కోట్లతో వికారాబాద్ పట్టణానికి శాటిలైట్ ప్రాజెక్టు మంజూరు చేయించానని, దేశంలో మొత్తం ఏడు శాటిలైట్ ప్రాజెక్టులు మంజూరు అయితే అందులో వికారాబాద్ ఒకటి అని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారడంతో ఆ నిధులలో మెజారిటీ రాలేదని అన్నారు.

మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలలో అవసరమైన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయిస్తానని, పట్టణ పరిధిలో అవసరమైన మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేయించడానికి రైల్వే శాఖతో ప్రయత్నాలు చేస్తున్నానని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్న జంక్షన్లను అభివృద్ధి చేయిస్తానని అన్నారు.

స్వర్గీయ మంత్రి చెన్నారెడ్డి నిర్మించిన శివసాగర్ చెరువును పూర్తిగా ఆధునికీకరణ చేయిస్తానని, హైదరాబాద్ ఎన్టీఆర్ పార్కు తరహాలో ఇక్కడ కూడా పార్కును ఏర్పాటు చేస్తామని, నిధులు తెచ్చి ఇచ్చే బాధ్యత తనదేనని తెలిపారు. సక్రమంగా అవసరమైన చోట మాత్రమే నిధులు చేయాలని పాలకవర్గానికి సూచించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు తీసుకు రావడానికి ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులను తీసుకురావాలని ప్రయత్నం చేశానని, గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసి మన ప్రాంతానికి అన్యాయం చేసిందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మన ప్రాంతానికి తీసుకురావాలని మళ్ళీ ప్రయత్నాలు చేస్తున్నానని, ఈసారి ఖచ్చితంగా విజయం సాధిస్తానని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మన వికా రాబాద్ పట్టణానికి త్రాగునీటితో పాటుగా నియోజకవర్గంలో సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని అన్నారు.

టీయూఎఫ్ఐడీసీ 60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, హెచ్ఎండీఏ నిధులు 270 కోట్లు త్వరలోనే మంజూరు అవుతాయని ఆయన తెలిపారు. నంతగిరిని వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే మన ప్రాంతంలోని మూడు వేల మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా ఉన్నప్పుడు పట్టణ పరిధిలోని నారాయణపూర్ లో వంద ఎకరాలలో టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధి చేసి నాలుగు వేల మంది మహిళలకు

మిగతా 2లో

# మహేశ్వరం బిఆర్ఎస్‌లో భారీ ప్రక్షాళన..

**మహేశ్వరం, మార్చి 31, ప్రభాతవార్త:** మహేశ్వరం పట్టణ బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా వాయిదా పడుతూ వస్తున్న పట్టణ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. మహేశ్వరం పట్టణ కేంద్రంలో మాజీ పట్టణ అధ్యక్షుడు దుడ్డు కృష్ణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నియామకాలు చేపట్టారు. పలువురు సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు మరియు కార్యకర్తల అభిప్రాయం మేరకు మహేశ్వరం పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షునిగా కటికల మహేందర్ ముదిరాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మహేశ్వరం గ్రామ సర్పంచ్ పదవిని బిఆర్ఎస్ కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఆ ఉత్సాహంతోనే పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కొత్త కమిటీని ప్రకటించారు.

**అనుబంధ సంస్థల అధ్యక్షులు వీరే..**

పార్టీ అనుబంధ సంస్థలకు కూడా కొత్త అధ్యక్షులను నియమిస్తూ సీనియర్ నాయకులు ఓ ప్రకటన విడుదల చేశారు.


పట్టణ అధ్యక్షుడిగా మహేందర్ ముదిరాజ్‌ను ప్రకటిస్తున్న పార్టీ నేతలు

నియామకమైన వారి వివరాలు ఇలా ఉన్నాయి. యువజన సంఘం అధ్యక్షుడు: బహుదురుగూడెం పవన్ , బిసి సెల్ అధ్యక్షుడు: మిద్దింటి సురేష్, ఎస్సి సెల్ అధ్యక్షుడు: దండు పెంటయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు: మునావత్ బాలునాయక్, రైతు సంఘం అధ్యక్షుడు: పోల్కం కిష్టయ్య, బిఆర్ఎస్వి అధ్యక్షుడు: పోతర్ల సంగయ్య యాదవ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునుగపాటి నవీన్, పార్టీ సీనియర్ నాయకులు కరొళ్ల చంద్రయ్య ముదిరాజ్, పోతర్ల అంబయ్య యాదవ్, స్వర్ణగంటి ఆనందము, జోరల రమేశ్, కడెమోని ప్రభాకర్, చంద్రమోలి, ఎస్ సంజీవ, ఎన్ సుదీర్ గౌడ్, ఎం బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు. నియామకమైన కొత్త కార్యవర్గం పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సీనియర్లు ఆకాంక్షించారు.

## నిరుపేద ఇంటి నిర్మాణానికి సర్పంచ్ సహకారం

**ఆమనగల్లు, మార్చి31, ప్రభాతవార్త:** సొంతింటి కల సాకారం చేసుకునేందుకు ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ నిరుపేద కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో సర్పంచ్ మానవత్వం ప్రదర్శించి అవసరమైన ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని రాంనుంతల గ్రామపంచాయతీ గేటు తండా కు చెందిన జటావత్ రక్మాకు చెందిన ఇళ్లు అసంపూర్తి నిర్మాణంతో ఆగిపోయింది. నిర్మాణంలో ఆర్థిక సమస్యలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వద్యావత్ శ్రీను నాయక్ వ్యక్తిగతంగా రూ.25,000 అందజేసి ఇంటి పైకప్పు నిర్మాణానికి సహకరించారు. ఈ సంధర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ఔధార్యంపై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రూప్ సింగ్ గారు, ఉపసర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు ధనరాజ్ , బలరాం మరియు గ్రామ యువకులు శాంతి లాల్, మోహన్, పవన్ పాల్గొనడం జరిగింది.

## ఆహారపు అలవాట్లపై అవగాహన

**కుల్కచర్ల, మార్చి 31, ప్రభాతవార్త :** విద్యార్థులకు చదవుతోపాటు ఆహార అలవాట్లపై అవగాహన పెంచేందుకే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించామని ప్రాధానోపాధ్యాయులు మహేద్రబహదూర్ అన్నారు. మంగళవలారం లమండల పరిధిలోని పుట్టాపహడ్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ ఆంజి లయ్య, ఉప సర్పంచ్ లాల్‌బహదూర్ శాస్త్రి విద్యార్థులు వండిన వంట పదార్థలను పరిశీలించి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించడానికి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఫుడ్ ఫెస్టివల్ ఒక అద్బుతమైన వేదిక అని తెలిపారు. విద్యార్థులకు జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలను ఏ అహారంలో ఏ విటమిన్లు ఉంటాయో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యర్థులు తమ ఇంటిదగ్గర వండి తీసుకొచ్చిన పదార్థులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**కీసర, మార్చి31, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ (ఐఎఎస్) వినయ్ క్రిష్టారెడ్డి అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్ 6 పరిధిలోని నాగారం డివిజన్ ఎస్‌వినగర్ కాలనీ రోడ్ నెంబర్ 2లో ఆకస్మికంగా పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఏ, ఎస్ఏటి వాహన డ్రైవర్లతో మాట్లాడి గృహల నుండి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతున్న విదానాన్ని సమీక్షించారు. అలాగే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ప్రతిరోజు తప్పనిసరిగా వెంటనే తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. వంద శాతం ఆదాయ వసూళ్ల సాధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో టాప్ వంద డిపాల్టర్లలో ఒకటైన బోగారంలోని హోళీమేరీ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి 19.22 లక్షల రూపాయలు పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్‌ను తక్షణమే చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డిఈఈ శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్, ఏఎంసి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తిరుమల్‌రెడ్డి

**కీసర, మార్చి 31, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కీసర సర్కిల్ 1 పరిధిలోని చీర్యాల గ్రామానికి చెందిన జిల్లాల తిరుమల్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ తన రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేస్తూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రారావు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, జిల్లా ఇంఛార్జి పట్లోళ్ల విక్రంరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఎలాంటి రాజకీయ నేపధ్యం లేని కుటుంబం నుండి సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఈ స్దాయికి రావడానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## శంషాబాద్‌లో మహాలక్ష్మి పథకం సంబురాలు

**రంగారెడ్డి అర్బన్ మార్చి31, ప్రభాతవార్త :** నిరుపేద మహిళలకు ఆర్టీసి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం అద్భుత విజయానికి ప్రతీకగా శంషాబాద్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పథకం విజయవంతమైన సందర్భంగా ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులు మరియు మహిళలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభించిన మహాలక్ష్మి పథకం మార్చి నెలతో 10,000 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణాలను విజయవంతంగా అందించిందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. నేటి వరకు కోట్ల మంది మహిళలు సురక్షి తంగా, ఉచితంగా ప్రయాణించడం గర్వకారణమని అన్నారు. అనంతరం ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఐదుగురు సాధారణ మహిళా ప్రయాణికులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఆర్టిసి డిఎం, స్థానిక ప్రజాప్రతినిధులు ,మహిళా ప్రయాణికులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

**కొడంగల్, మార్చి 31, ప్రభాతవార్త :** ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొడంగల్ పట్టణ శివారులోని రాఘవేంద్ర గార్డెన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ. సత్యనారాయణ అధ్యక్షతన అరైవ్=అలైవ్, డ్రగ్స్ నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి పలువురికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేటి యువత దేశానికి



డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేస్తున్న ఎస్పీ

వెన్నముక అని, అటువంటి యువశక్తిని నిర్వీర్యం చేసేందుకు డ్రగ్స్ మాఫియా పన్నుతున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్రగ్స్ అనే మత్తు ఊబిలో చిక్కుకొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా భయం లేకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం అరైవ్=అలైవ్ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిస్తు ప్రతిరోజు ఉపాధి కోసం బయటకు వెళ్ళే వ్యక్తులు తిరిగి క్షేమంగా తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు, డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తుచ తప్పకుండా పాటించాలని, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చూపు స్పష్టంగా ఉండటం అత్యంత కీలకమని, అందుకే డ్రైవర్ల కోసం ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించాచరు. ప్రతి డ్రైవర్ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిగికి చెందిన ఛత్రాజీ ఆసుపత్రి ఆప్తాల్మిక అధికారి సంధ్యరాణి అధ్వర్యంలో డ్రైవర్లుకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములునాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణ, ఎంవీఐ వసంత్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

**ధారూర్, మార్చి 31, ప్రభాతవార్త:** ధారూర్ మండల ప్రజల చిరకాలవాంఛ అయిన కోట్‌పల్లి వాగు హైలెవల్ బ్రిడ్జి కల సాకారం కాబోతోందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ధారూర్ మండలంలో రూ. 27 కోట్ల 50 లక్షల భారీ వ్యయంతో నిర్మించనున్న నూతన హైలెవల్ బ్రిడ్జి పనులకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ ప్రసాద్ కుమార్, ప్రతి ఏటా వానాకాలం వచ్చిందంటే ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు ప్రాణాలకు తెగించి వాగు దాటాల్సిన పరిస్థితి ఉండేది. గతంలో వరదల ఉధృతికి ప్రస్తుతం ఉన్న లోలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయినప్పుడు ప్రజలు పడ్డ ఇబ్బందులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఆ కష్టాలను శాశ్వతంగా తొలగించాలనే లక్ష్యంతోనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చర్చించి ఈ భారీ నిధులను మంజూరు చేయించాను అని ఆయన వివరించారు. ఈ బ్రిడ్జి పనులను అత్యంత నాణ్యతతో, వేగంగా పూర్తి చేయించి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి విజన్‌తో నిర్మించిన కోట్‌పల్లి రిజర్వాయర్ నేడు కేవలం 3 వేల ఎకరాలకు మాత్రమే నీరందిస్తోంది. 9 వేల ఎకరాల పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ. 90 కోట్లతో రిజర్వాయర్ ఆధునీకరణ పనులు చేపడుతున్నాం. ఈ పనులు పూర్తయితే రైతుల పొలాలు పచ్చని పంటలతో కళకళలాడుతాయన్నారు. జిల్లా బిడ్డ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం.

**ఏ సమస్య ఉన్నా నాది బాధ్యత**

తాను స్పీకర్ హోదాలో ఉండటం వల్ల నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

లేని విధంగా నిధులు వస్తున్నాయని, ఇప్పటికే రూ. 600 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం జరుగుతోందని స్పష్టం చేశారు. అనంతరం ధారూర్ రైతు వేదికలో వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 286 మంది సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తూ.. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి, అభివృద్ధిలో అందరూ ఒక్కటిగా నడవాలి. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా నేరుగా నా దృష్టికి తీసుకురండి, పరిష్కరించే బాధ్యత నాది అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్ అండ్ బి సీఇ వసంత నాయక్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ శ్రావణ్, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీఓ సఫీ ఉల్లా ఖాన్, ఏఈ సమీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాన్సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు, సర్పంచ్ ప్రమీల చిన్నయ గౌడ్ , బాబా ఖాన్, లాల్ మొహమ్మద్, సర్పంచులు, పంచాయతీ కార్యదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న అధికారులు

## పట్టా భూములు వదిలేయండి

**కందుకూరు, మార్చి 31, ప్రభాతవార్త :** భూసేకరణ సందర్భంగా మా వద్ద ఉన్న అసైని భూములను తీసుకున్న పర్వాలేదు కానీ పట్టా భూమిని తీసుకోకుండా చూడాలని భూములన్ని కోల్పోతే మాకు జీవనాధారం పోతుందని తిమ్మాయపల్లి రైతులు అధికారులతో గ్రామ సభ సందర్భంగా గోడును వెళ్ళబోసుకున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణ కార్యక్రమం కందుకూరు మండలంలోని తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 1, 2,3,4,5,6,7,8, మరియు 10,12,13,14,15. సర్వే నెంబర్లలో 63 ఎకరాల భూమిని టీజీ ఐ ఐ సి తీసుకోవడానికి చర్యలు చేపట్టింది అందులో భాగంగా రెవెన్యూ అధికారులు ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రకాలుగా రైతులలో చర్చించి రైతులను గుర్తించడం జరిగింది. అందులో భాగంగా మంగళవారం ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి తహసిల్దార్ గోపాల్ అధికారులు గ్రామానికి వెళ్లి సంబంధిత రైతులు ప్రజాప్రతినిధులతో గ్రామసభను నిర్వహించారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం అసైన్ భూములు తీసుకొని తగిన నష్టపరిహారం అందించాలని కోరారు అదే విధంగా తీసుకున్న తర్వాత పట్టా భూములను రైతులకు వదిలేయాలని డిమాండ్ చేశారు అన్ని భూములు తీసుకుంటా అంటే మేము తరతరాలుగా భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని భూములు కోల్పోతే మాకు జీవనాధారం పోతుందని సూచించారు ఈ విషయమై ప్రభుత్వ భూములనే తీసుకుంటామని తీసుకోకుండా చూస్తామని అధికారులు ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ సభలు విజయవంతం చేయాలి

### -వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 31, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించే గ్రామ, వార్డు సభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీఓలు,



ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలిఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ సభల నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సభలకు సంబంధించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముందస్తు సమాచారం అందించి వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఉదయం 10 గంటలకు సభలు ప్రారంభం కావాలి. పాఠశాలలు, పంచాయతీ భవనాలు లేదా అనువైన బహిరంగ ప్రదేశాల్లో సభలు ఏర్పాటు చేయాలి. రాష్ట్ర గీతంతో సభను మొదలుపెట్టి, ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు వినిపించాలి. సదుపాయాల్లో లోటు ఉండకూడదువేసవి దృష్ట్యా గ్రామ సభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా:మహిళలు, వృద్ధులకు ప్రత్యేకంగా కూర్చునే ఏర్పాట్లు చేయాలి. తాగునీరు, నీడ (టెంట్లు) సౌకర్యం కల్పించాలి. పథకాల వివరణ కోసం ప్రొజెక్టర్లు, స్క్రీన్లు ఏర్పాటు చేయాలి. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బ్యానర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలి. అందరి కృషితోనే సక్సెస్‌గ్రామ సభల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, రైతులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై కూలంకషంగా చర్చించి, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్వో సంగీత, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, వివిధ శాఖల అధికారులు రామారావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషు రామ్, పద్మావతి, శ్రీలత, శ్రీలక్ష్మి, ఉష, సురేష్, పూర్ణిమ, చంప్లా నాయక్, సుశిందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



వేలం పాట సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పత్యనాయక్

## తైబజార్ వేలంకు స్పందన శూన్యం

**ఆమనగల్లు, మార్చి31, ప్రభాతవార్త:** 2026-27 ఆర్థిక సంవత్సరంకు ఆమనగల్లు మున్సిపాలిటీ తైబజార్ హక్కులకు మంగళవారం జరగవలసిన వేలం పాట సరైన స్పందన లేకపోవడంతో బుధవారానికి వాయిదా పడింది. వేలంలో ఆశావాహులు 18 మంది డిడిలు కట్టి హక్కుల వేలం అర్హత పొందారు. అంతేకాకుండా మొదటిసారి నాన్‌రిఫండబుల్ అమౌంట్ రూ. 5వేలు విధానాన్ని ప్రవేశపెట్టారు. కాగా మున్సిపాలిటీ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం పాటకు అధికారులు సిద్ధం అయ్యారు. చైర్మన్ నేనావత్ రాంపాల్‌నాయక్, కమిషనర్ శంకర్‌నాయక్, మేనేజర్ ఇస్లావత్ రమేశ్‌నాయక్‌లు పర్యవేక్షణలో కౌన్సిలర్ల సమక్షంలో వేలం పాట ప్రారంభించారు. గత సంవత్సరం హక్కుల విలువ రూ. 34లక్షలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వేలం పాట ప్రారంభాన్ని 19లక్షల పైచిలుకు ప్రకటించడంతో అక్కడ ఉన్న వారు అనాసక్తి ప్రదర్శించారు. గంటల పాటు వేచి ఉన్నా వారి నుండి స్పందన రాకపోవడంతో వేచి చూసి చివరికి ఏప్రిల్ 1కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న డిఆర్‌డిఓ శ్రీలత

## ప్రజాపాలన తీరుపై డిఆర్‌డిఓ అసంతృప్తి

**కందుకూరు, మార్చి 31 ప్రభాతవార్త:** కందుకూరు మండలంలో జరుగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను మంగళవారం డిఆర్డిఓ అధికారిని శ్రీలత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మీరు ఖాన్ పెట్, ముచ్చర్ల, గ్రామాలలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. భాగంగా అంగన్వాడి కేంద్రాలను పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాలను గ్రామపంచాయతీ తోపాటు ప్రభుత్వ భవనాలను స్మశాన వాటికలను డంపింగ్ కేంద్రాలను నర్సరీలను తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ అధికారిని శ్రీలత మాట్లాడుతూ అధికారులు ఇంకా 90 రోజుల కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు చాలా ప్రాంతాలలో అనుకున్న లక్ష్యాలు నెరవేరినట్లు కనిపించడం లేదని అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని బాధ్యతతో వ్యవహరించాలని తమ ఇండ్ల వద్ద ఎంత జాగ్రత్తగా పనులు నిర్వహించుకుంటాము అదేవిధంగా గ్రామాలలో మనకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్వహించాలని సూచించారు. ఈ పనులలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఈ సందర్భంగా మిర్ఖాన్పేట్ సర్పంచ్ నరేష్ స్పందిస్తూ గ్రామపంచాయతీలో నిధుల కొరత తీవ్రంగా ఉన్నారని సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరిత ఎంపిఓ గీత ఏపీవో రవీందర్ రెడ్డి ఆయా గ్రామాల్లో ఉపసర్పంచ్లు పంతం మల్లేశా పేరటి రవి ఊటు మహేందర్ ఆయా గ్రామాల అంగన్వాడీ టీచర్లు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డుతో కొందుర్గు అభివృద్ధి చెందుతుంది

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**కొందుర్గు, మార్చి 31, ప్రభాతవార్త :** రేడియల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇన్నో లాభాలు కలుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాడు మండల పరిధిలోని చుక్క మెట్టు, ముటుపూర్, లాలాపేట్, ఉమ్మెంత్యాల గ్రామాలలో రేడియల్ రోడ్ 2 నిర్మాణం పునరావాసము మరియు పున :రుద్దరణ పథకం ద్వారా భూ సేకరణ కోసం ఏర్పాటుచేసిన గ్రామ సభలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వము రేడియల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రేడియల్ రోడ్ నిర్మాణం వలన ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఎన్నో ఫ్యాక్టరీలు వస్తాయని, నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. భూ నిర్వాసితులు ప్రభుత్వానికి సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. రైతులు తెలిపిన విన్నపాలను, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూరేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**భూమిని నమ్ముకొని బతుకుతున్నాం**

తమ కోరికలు సంపాదించిన భూమిలో సేద్యం చేసుకుని పంటలు పండించి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, అలాంటి పంట పొలాలలో ప్రభుత్వం రేడియల్ రోడ్డు నిర్మిస్తే ఇక తమ బ్రతుకు అగమ్య గోచరమని భూ నిర్వాసితులు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలో షాద్నగర్ పరిగి రహదారి డబల్ రోడ్డు ఉండగా, దాన్ని వెడల్పు చేయకుండా, పంటలు దిగుబడి వచ్చేపొలాల్లో రేడియల్ రోడ్డు నిర్మాణం ఎవరికి అవసరమని, ఎందుకు నిర్మిస్తున్నారని ఆ భూములు కోల్పోతున్న రైతులు ప్రశ్నించారు. మాభూమి ఎంత పోతుందో అంత భూమి ఇవ్వండి! లేదా సరైన న ష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ గ్రామ సభలో షాద్నగర్ ఆర్డిఓ సరిత, ఎసిపి లక్ష్మీ నారాయణ, తహసిల్దార్ ఆజం అలీ, సిఐ శ్రీనివాస్, ఎస్సైలు రవీందర్ నాయక్, విజయ్, సర్పంచులు అంజయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో 25.45 కిలోల గంజాయి స్వాధీనం

**రంగారెడ్డి అర్బన్, మార్చి 31, ప్రభాతవార్త:** గుట్ట చప్పుడు కాకుండా విదేశాల నుంచి అక్రమంగా మత్తు పదార్థాలు సరఫరా చేస్తూ డిఆర్ఐ అధికారులకు పట్టుబడ్డ ఘటన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. డిఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విదేశాల నుండి అక్రమంగా మత్తు పదార్థాలు తీసుకు వస్తున్నారన్న పక్కా సమాచారంతో మంగళవారం తెల్లవారుజామున బ్యాంకాక్ నుండి వచ్చిన విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా విమానంలో వచ్చిన ఇద్దరు ప్రయాణికులపై అనుమానం వచ్చి వారిద్దరిని అదుపులోకి తీసుకొని వారిని, వారి వద్ద ఉన్న లగేజీని స్కానింగ్ చేయడంతో అలాగేజి బ్యాగులలో మత్తు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. బ్యాగులో కవర్లను చుట్టి ముద్ద రూపంలో ఉన్న ఆకుపచ్చ పదార్థంతో యాడ్ చేసి తీసుకువచ్చారు దాన్ని పరిశీలించగా హైడ్రోపోనిక్ గంజాయిగా గుర్తించామని వారి వద్ద నుండి 25.45 కిలోల హైడ్రోపోని గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న హైడ్రోపోని గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో 8.9 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని వారిపై ఎన్డిపిఎస్ చట్టం 1985 నిబంధనల ప్రకారం కేసును నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

**శామీర్‌పేట, మార్చి 31, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను కలిసి అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ నిధుల మంజూరుకై వారు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా కీసర ఓఆర్ఆర్ నుంచి రామలింగంపల్లి, ఉద్దెమర్రి గ్రామాల మీదుగా తుర్కపల్లి రాజీవ్‌రహదారి వరకు 4లైన్ల రోడ్డు వెడల్పు కోసం విస్తరణ పనులు చేపట్టటానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని వారు కలిసి కోరారు. మంగళవారం ఆయన నివాసంకు వెళ్లి కలిసి అభివృద్ధి పనుల కోసం మంజూరు కోసం వినతిపత్రాన్ని వారు అందజేశారు.

## కొడంగల్‌కు ధీటుగా వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కల్పించాలని ప్రయత్నం చేశానని, గత ప్రభుత్వం పదేళ్ళు పట్టించుకోలేదని, తిరిగి ఇప్పుడు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించానని అన్నారు. పట్టణ ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. చిన్న వయసులోనే చైర్మన్ అయిన కూతురు గడ్డం అనన్య పై మీ అందరి ఆశీర్వాదం ఉండాలని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ, సమస్యల ప్రాధాన్యతగా వార్డులలో నిధులు కెటాయించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్, మున్సిపల్ కమీషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, వార్డుల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## చౌదరిగుడా పంచాయతీ అభివృద్ధికి బాటలు

### -రూ. 29 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రంగారెడ్డి, మార్చి31, ప్రభాతవార్త :** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండలం చౌదరిగుడ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన అంతర్గత సి.సి. రోడ్లను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....సి.ఆర్.ఆర్ ఫండ్.. కింద మంజూరైన 29 లక్షల రూపాయల నిధులతో గ్రామపంచాయతీలోని ప్రధాన వీధుల్లో సిసి రోడ్లను అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించడం జరిగిందని నియోజకవర్గంలోని ప్రతి మారుమూల ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే వరకు మా కృషి కొనసాగుతుంది. గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. గత కొంతకాలంగా వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్న తమ వీధుల్లో సి.సి. రోడ్లు నిర్మించడంపై గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చదరగూడ సర్పంచ్ లక్ష్మి లింగం, స్థానిక వార్డు సభ్యులు, నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**కీసర, మార్చి31, ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ (ఐఎఎస్) వినయ్ క్రిష్టారెడ్డి అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్ 6 పరిధిలోని నాగారం డివిజన్ ఎస్‌వినగర్ కాలనీ రోడ్ నెంబర్ 2లో ఆకస్మికంగా పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఏ, ఎస్ఏటి వాహన డ్రైవర్లతో మాట్లాడి గృహల నుండి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతున్న విదానాన్ని సమీక్షించారు. అలాగే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ప్రతిరోజు తప్పనిసరిగా వెంటనే తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. వంద శాతం ఆదాయ వసూళ్ల సాధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో టాప్ వంద డిపాల్టర్లలో ఒకటైన బోగారంలోని హోళీమేరీ ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి 19.22 లక్షల రూపాయలు పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్‌ను తక్షణమే చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డిఈఈ శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్, ఏఎంసి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ వినయ్ క్రిష్టారెడ్డి

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తిరుమల్‌రెడ్డి

**కీసర, మార్చి31, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కీసర సర్కిల్ 1 పరిధిలోని చీర్యాల గ్రామానికి చెందిన జిల్లాల తిరుమల్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో విశ్వాసంతో అడుగు అడుగున నన్ను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ నా రాజకీయ ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేస్తూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రారావు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, జిల్లా ఇంఛార్జి పట్లోళ్ల విక్రంరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఎలాంటి రాజకీయ నేపద్యం లేని కుటుంబం నుండి సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఈ స్దాయికి రావడానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

## టెండర్‌ల హక్కులలో స్థానికులకే అవకాశం ఇవ్వాలి

**ఆమనగల్లు, మార్చి 31, ప్రభాతవార్త :** ఆమనగల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జరిగే చికెన్ వ్యర్థాల హక్కుల వేలం పాటలో స్థానికులకే అవకాశం కల్పించాలని పలువురులు సంబంధిత అధికారులను కోరారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. హక్కుల కోసం సమర్పించిన స్థానికేతరుల డీడీలను పరిగణలోకి తీసుకోకూడదన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ శంకర్ నాయక్‌ను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు జల్లెల శివ, ,పాతకోట శ్రీశైలం, కొమ్ము ప్రసాద్, నాగిళ్ళ లక్ష్మణ్, ముక్కిరి వెంకటేష్, ఒగ్గు మహేష్, లండం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ పాపిశెట్టి రాము

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, మార్చి31, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి లోని 10వ వార్డు విఠాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పార్టీ శ్రేణులతో మంగళవారం బాధిత కుటుంబాన్ని కలుసుకుని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అనంతరం రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంచుకొండ జగదీష్, గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్, చంద్రు నాయక్, మాజీ సర్పంచ్ సాలయ్య, పాపయ్య, కిషోర్ నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులకు తక్షణ స్పందన

**యూసుఫ్‌గూడ మార్చి 31 ప్రభాతవార్త :**

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ రోడ్డు నంబర్ 1 పరిధిలో గత కొన్ని రోజులుగా డ్రైనేజి లైన్ పొంగిపొర్లడంతో పాటు రైల్వే ట్రాక్ వెంబడి మురుగు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సమీప ఇళ్లలోని బోర్‌వెల్స్‌లో కూడా డ్రైనేజి నీరు వస్తుందని ప్రజా వాణిలో స్థానిక సంక్షేమ సంఘం తరఫున ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ ఫిర్యాదుకు స్పందించిన అధికార యంత్రాంగం మం గళవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీ లించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న కలుషిత నీటి సమస్యను సత్వరమే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



తూంకుంటలో వీధికుక్కల దాడులు పెరిగాయని తగు చర్యలు తీసుకోవాలని కీసర సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేసిన యువ నాయకులు రంగ ప్రవీణ్‌గౌడ్ దృశ్యం

## తూంకుంటలో వీధి కుక్కల (దాడులు) బెడద

**..సమస్యను పరిష్కరించాలి..కీసర సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం**

**శామీర్‌పేట, మార్చి 31, ప్రభాతవార్త :** శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంటలో వీధి కుక్కల దాడులు (బెడద) అధికం అవుతున్నట్లు, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కీసర సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వసంతను తూంకుంట యువ నాయకులు రంగ ప్రవీణ్‌గౌడ్ ఆ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కీసర సర్కిల్ శామీర్‌పేట డివిజన్ పరిధిలోని తూంకుంటలో వీధి కుక్కల దాడులు తీవ్రం అవుతున్నట్లు, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తూంకుంట గ్రామంలో విచ్చల విడిగా వీధి కుక్కలు సంచరిస్తున్నట్లు, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్నపిల్లలు బయట ఆడుకోలేని, బయటకు పంపలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. మహిళలు కూడ బయటకు వెళ్లాలంటే కుక్కల బాధతో భయపడుతున్నారని అన్నారు. శానిటేషన్ సరిగ్గా లేక దోమలు పెరిగినట్లు రోగాల బారిన పడకుండ తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ వసంతను యువ నాయకులు ప్రవీణ్‌గౌడ్ కోరారు.



హకీంపేట్ ఆర్టీసి డిపోలో మహాలక్ష్మి పథకం విజయోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా మహిళలను సన్మానించిన ఆర్టీసి అధికారులు,పాల్గొన్న జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,నాయకుల దృశ్యం

## మహాలక్ష్మి పథకం విజయోత్సవం

**..మహిళలకు సన్మానాలు ..హకీంపేట్ ఆర్టీసి డిపోలో మహిళలతో జరిగిన సంబరాలు**

**శామీర్‌పేట, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకం విజయోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా మహిళలను హకీంపేట్ డిపో ఆర్టీసి అధికారులు సన్మానించారు. దీనిలో మేడ్చల్ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యురాలు ఎస్.ఇందిర, పలువురు నాయకులు పాల్గొని సన్మానించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపోలో ఆర్టీసి బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ప్రయాణం చేసే మహిళలకు సన్మాన కార్యక్రమం జరిగింది. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు. జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆర్టీసి బస్సులో సుమారు 290కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్టీసికి సుమారు 10వేల కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలుగా ఆదాయంగా అందినట్లు తెలిపారు. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగ అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం మహిళల జీవనవిధానంలో గణనీయమైన మార్పులు తీసుకవస్తుందని, రవాణా ఖర్చులు మహిళలకు ఆర్థిక భారాన్ని తగ్గించటంతో పాటు వారిలో స్వాలంభన కూడ పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి అధికారులు డిపో ఫోర్‌మెన్ రాంమోహన్, టిఐటి శంకర్, సెక్యూరిటీ హెడ్ గార్డ్ సుదర్శన్, ట్రాఫిక్ ఇంచార్జి చంటి, గోపు శ్రీనివాస్, వెంకటేశ్, నిరంజన్, వెల్ఫేర్ మెంబర్ శ్రీలత, నాగమణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, మహ్మద్ జాఫర్, నక్క మల్లేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి

**మండల ప్రత్యేక అధికారి వెంకయ్యనాయక్**

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 31, (ప్రభాతవార్త):** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ పల్లెలు పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా తయారు చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకయ్యనాయక్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని వనంపల్లి గ్రామాన్ని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణం, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయితీ భవనం, కమ్యూనిటి ప్లాంటేషన్, గ్రామంలోని రోడ్లు, మురుగు కాలువలు, తదితర పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో అన్ని పనులు చేసి గ్రామాన్ని సుందరంగా మార్చాలని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, ఎంపిఓ హన్మంతురెడ్డి, ఉప సర్పంచ్ ఎండి పాషా, తదితరులు ఉన్నారు.



వనంపల్లి గ్రామాన్ని సందర్శించిన మండల ప్రత్యేక అధికారి వెంకయ్య నాయక్

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ శిబిరం

**మోమిన్‌పేట్, మార్చి 31, ప్రభాతవార్త:** గత ఐదు రోజులుగా మోమిన్‌పేట మండల కేంద్రంలో జరుగుతున్న వార్డు సభ్యుల శిక్షణ శిబిరం మంగళవారం ముగియడంతో అన్ని గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ పొందినట్లు సభ్యులందరికి శిక్షణ అనంతరం ధృవ పత్రాలను మంజూరు చేసినట్లు ఎంపిడిఓ రాజమల్లయ్య తెలిపారు. ఈ ఐదు రోజుల శిక్షణలో వార్డు సభ్యుల యొక్క విధినిర్వహణ, వారి కర్తవ్యాల గురించి పూర్తి అవగాహన కల్పిడం జరిగిందని తెలిపారు. వార్డు సభ్యుల పదవీకాలం పూర్తి అయ్యేంతవరకు తమ తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి వార్డు సభ్యులుగా మంచి గుర్తింపు పొందేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజమల్లయ్య, ఎంపిఓ యాదగిరి, శిక్షణాదికారి, ఆయా గ్రామాల వార్డు సభ్యులు, వెల్‌చాల్ గ్రామ పంచాయతి కార్యధర్శి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు గ్రామసభలు నిర్వహించాలి

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 31, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం గ్రామ సభలు నిర్వహించాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు ఏప్రిల్ 2వ తేదిన మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ప్రగతి ప్రణాళిక 99రోజుల యాక్షన్‌ప్లాన్‌లలో భాగంగ ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10గంటలకు గ్రామసభలు సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలని ఆయన పెర్కొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పోలీసులు

**మహేశ్వరం మార్చి31 (ప్రభాతవార్త)** మహేశ్వరంలో గత రెండు సంవత్స రాలుగా సిఐగా విదులు నిర్వహించి పక్కమండలం కందుకూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన సిఐ హెచ్ వెంకటేశ్వర్లు సిఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రేమ పూర్వకంగా మాజీ శాసన సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ నాయకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని మంగళవారం కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా కెవిఎల్‌ఆర్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉంటు శాంతి భద్రతలను కాపాడుతు ప్రభుత్వానికి తగిన గుర్తింపు తేవాలని ఆయన కోరారు. మహేశ్వరం పోలీసు స్టేషన్‌లో విదులు నిర్వహించిన విదంగా కందుకూరు మండలంలో కూడా నిర్వహించి మంచి గుర్తింపు తీసుక రావలని కెవిఎల్‌ఆర్ సుచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పోలీసులు ఒక వారదిగా పనిచేయాలన్నారు.

## ఎఫ్ఎస్ఓ అరుణకు గోల్డ్ మెడల్

**వికారాబాద్, ప్రభాతవార్త :** వికారాబాద్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన అరుణా రెడ్డి గోల్డ్ మెడల్ సాధించారు. 8వ బ్యాచ్‌కు చెందిన ఎఫ్ఎస్ఓ లకు 3 నెలల పాటు శిక్షణా కార్యక్రమం హైదరాబాద్ నగరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో 44 మంది సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన వికారాబాద్ ఎఫ్ఎస్ఓ అరుణా రెడ్డి గోల్డ్ మెడల్ సాధించారు.



గోల్డ్ మెడల్ సాధించిన వికారాబాద్ ఎఫ్ఎస్ఓ అరుణా రెడ్డి

## కీసరలో ఘనంగా కురుమారియమ్మ బోనాలు

**కీసర, మార్చి31, ప్రభాతవార్త:** కీసరలో కొలువై ఉన్న తమిళుల ఆరాధ్య దైవం కురుమారియమ్మ ఉత్సవాలలో భాగంగా మంగళవారం బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తమిళనాడు నుండి ఎన్నో ఏండ్లుగా వలస వచ్చి కీసరలో స్థిరపడినా ప్రతి సంవత్సరం తమ సాంప్రదాయం ప్రకారం మూడు రోజులు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం రాత్రి కీసరలోని పెద్దమ్మ చెరువు వద్ద కరగం తీర్థం నిర్వహించారు .కొత్త కుండకు అలంకారం చేసి 101 కలశాలతో చెరువులో నుంచి నీటిని తీసుకెళ్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని అభిషేకించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివాజీనగర్ కాలనీలో నివసించే తమిళులు డప్పు వాయిద్యాలతో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద అమ్మవారికి ఇష్టమైన పొంగలి వండి సమర్పించారు .ఆశేషంగా తరలివచ్చిన భక్తులకు నాయకపు గంగారం ముదిరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదె రమేష్‌గుప్తా, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ రాయిల శ్రావణ్‌కుమార్ గుప్తా, మాజీ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, ఆలయ పూజారి అశోక్ పాల్గొన్నారు.



కీసరలో కురుమారియమ్మ బోనాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న తమిళ భక్తులు



కురుమారియమ్మ కరగం తీర్థం తీసుకువస్తున్న పూజారులు,భక్తులు

## శివపార్వతుల కళ్యాణానికి హాజరైన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్

**షాద్ నగర్, మార్చి 31, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలో ఫరూఖ్ నగర్ శ్రీ గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవములు భాగంగా మంగళవారం శివ పార్వతుల కళ్యాణమహోత్సవానికి హాజరైన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కె కె కృష్ణ, పెంటయ్య, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, పెద్ది రాం మోహన్, కానుగు రాం భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

## చెరువు పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి



ఎదులాబాద్ చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధికాగుప్తా

**ఘట్‌కేసర్, మార్చి 31, ప్రభాతవార్త:** చెరువు పరిసరాల్లో నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలని ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తా అధికారులను ఆదేశించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని లక్ష్మినారాయణ చెరువును ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె చెరువు నిర్వహణ, క్యాచ్‌మెంట్ ప్రాంతం, విస్తీర్ణం, వాగుల ప్రవాహంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చేపట్టవలసిన ముందస్తు చర్యలపై జడ్‌సీ సమీక్షించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో నీటి పారుదల వ్యవస్థలు, చెరువు కట్ట బలపరచడం, చెత్త తొలగింపు, డీసిల్టింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. వర్షాల సమయంలో నీటి ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెరువులో నీటి ప్రవాహం సజావుగా ఉండేలా కాలువలను శుభ్రపరచాలని, చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా వర్షాకాలపు ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేయాలని జడ్‌సీ సూచించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ డిప్యూటి కమీషనర్ అల్లూరి వాణిరెడ్డి, ఈఈ రమేశ్‌బాబు, డిఈఈ నరేశ్‌కుమార్, ఎస్‌డబ్ల్యుఎం డీఈఈ ఎస్.శ్రీనివాస్, ఏఈ రవికిరణ్, విశేష్‌నాయక్, సహకార సంఘం మాజీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**ఘట్‌కేసర్, మార్చి 31, ప్రభాతవార్త:** మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు-నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలకు పెద్దపీట వేస్తూ వారి ఆర్థిక స్వాలంభన కోసం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్ ఆవరణలో మంగళవారం పలువురు మహిళలను సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం రెండు ఏళ్ల పూర్తి చేసుకొని విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో మహిళలను గౌరవిస్తూ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆసుపత్రి నర్సులు, కళాశాల విద్యార్థినులను కలుపుకొని ఐదుగురు మహిళలను శాలువాలతో సన్మానించి కానుకలు అందజేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 251 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణం చేయగా తద్వారా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు పదివేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదా జరిగిన సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.



బస్‌టెర్మినల్‌లో మహిళలను సన్మానిస్తున్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్

## గ్రామాభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి

**మొయినాబాద్, మార్చి31, ప్రభాతవార్త :** గ్రామంలోని సమస్యలపై దృష్టి సాధిస్తే అభివృద్ధి సాధ్యమని ప్రత్యేక అధికారి హార్టికల్చర్ ఏడీ కిషన్ రావు అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామాన్ని మంగళవారం హార్టికల్చర్ ఏడీతో పాటు ఎంపీడీఓ సంధ్య గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠదామం, వర్మికంపోస్టు యాడ్ పరిశీలించడంతో పాటు గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ రికార్డులు క్రమంగా నిర్వహించాలని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేయాలని, మంచినీటి సమస్య రాకుండ జాగ్రత్త పడాలని అన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి చెత్తను డంపింగ్యార్డుకు తరలించాలని తడి చెత్తతో కంపోస్టు తయారు చేయాలని చెప్పారు కార్యక్రమంలో సర్పంచ్ గీతామహిపాల్, ఉపసర్పంచ్ సుమలత, కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు అమరేందర్ రెడ్డి, రమేష్, ప్రభాకర్, జంగయ్య, దీనకన్న, రాజు, కీర్తిప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**షాబాద్, మార్చి 31, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన షాబాద్ మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డి గూడెం గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం లభించింది. మంగళవారం ఉదయం మల్లారెడ్డి గూడ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పొలాలలోకి వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జి వాగులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

**షాబాద్, మార్చి 31, ప్రభాతవార్త :** విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన ఘటన షాబాద్ మండలం నాగర్కుంట గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని నాగర్కుంట గ్రామంలో బబ్బూరు సాయికుమార్ గౌడ్ (35) శంషాబాద్ ఎయిర్పోర్ట్ కాలనీలో నివాసం ఉంటూ, హైతాబాద్ లోని ఒక ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. నాగర్ కుంటలో ఉంటున్న సోదరి ఇంటికి వచ్చి, అదే గ్రామానికి చెందిన శివకుమార్ రెడ్డి మామిడి తోటలో కాయలు కోయడానికి వెళ్ళాడు. మామిడి చెట్టుపై నుండి 11 కేవీ విద్యుత్ సరఫరా వైర్లు ఉన్న విషయం గమనించకుండా చెట్టు పైకి ఎక్కడంతో విద్యుత్ వైర్లు తగిలి చెట్టుపైనే మృతి చెందాడు. మృతుని బావ నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రాధాన్యత క్రమంలో హామీల అమలు

**-శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్ధానాలు, మేనిఫెస్టోలో పెట్టిన హామీలను మెజారిటీగా అమలు చేస్తున్నామని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో 10 వేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదా కార్యక్రమంలో భాగంగా సభాపతి ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లాలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రూ.2.04 కోట్ల వ్యయంతో కూడిన 6.21 లక్షల మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. అదేవిధంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు ఇస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. స్వంత ఇళ్ళు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అవుతున్నాయని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు, సన్న బియ్యం పంపిణీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన మహిళలకు నెలకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం, స్కూటీ, తులం బంగారం ఇవ్వలేక పోతున్నామని, ఆర్థిక పరిస్థితులు మెరుగైన త్వరలోనే ఈ హామీలను కూడా అమలు చేస్తామని ఆయన అన్నారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళలకు పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలకు అన్ని విధాలుగా భరోసా ఇస్తున్న ప్రజా ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని స్పీకర్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## క్రమశిక్షణతో పనిచేసే వారికే గుర్తింపు, గౌరవం

**నందిగామ, మార్చి 31, ప్రభాతవార్త:** పోలీస్ శాఖలో 37 సంవత్సరాలు పనిచేస్తూ ఎటువంటి రీమార్క్ లేకుండా ప్రజలకు సేవ చేయడం ఎంతో గర్వకారణం అని సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి పూల బొకే ఇచ్చి అభినందించారు. నందిగామ మండల పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించి మంగళవారం పదవి విరమణ పొందిన ఎస్సై కావలి యాదయ్య ను సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే వారికి ఎప్పటికైనా ప్రత్యేక గుర్తింపు గౌరవం దక్కుతుందన్నారు. వృత్తి పట్ల అంకితభావం విధి నిర్వహణలో తనదైన రీతిలో అందరిని కలుపుకుంటూ అందరి మన్ననలను చూరగొన్న యాదయ్య సేవలో అభినందనీయమన్నారు. పదవి విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమని పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పదవి విరమణ గ్రహీత ఎస్ఐ యాదయ్య సన్మానసభలో పోలీసు ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఉన్నారు.



పల్లుట్టలోని స్మశాన వాటికను పరిశీలించిన జిల్లా ఎస్సి కార్పోరేషన్ ఇడి పద్మావతి

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

**-జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఇడి పద్మావతి సూచన**

**చేవెళ్ల, జనవరి 31, ప్రభాతవార్త:** గ్రామాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ఎస్సి కార్పోరేషన్ ఇడి పద్మావతి సూచించారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పల్లుట్ట, కందవాడ గ్రామాలల్లో పర్యటించి శానిటేషన్, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సి కార్పోరేషన్ ఇడి పద్మావతి మాట్లాడుతూ అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రకృతి వనాలు, స్మశానవాటికలను శుభ్రం చేయాలన్నారు. చెట్లకు నీరును క్రమం తప్పకుండా పట్టి చెట్లు ఎండిపోకుండా చూడాలన్నారు .గ్రామాలల్లోని వాటర్ ట్యాంకులల్లో గ్లీచింగ్ పౌడర్‌ను వేయించాలన్నారు. గ్రామాలల్లో పారిశుధ్యపనులు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకటేశం, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

**కొడంగల్‌రూరల్, మార్చి 31, ప్రభాతవార్త:** ఇటీవల వెలువడిన ఫలితాల్లో గురుకుల పాఠశాలకు ఎంపికై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృంధం సన్మానించారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ పాఠశాల నుండి గురుకుల పాఠశాలకు ఎంపికైన 11 మంది విద్యార్థులు, వారి తల్లి దండ్రులను పాఠశాల ఫౌండర్ లక్ష్మీ వెంకటయ్య ,ప్రిన్సిపాల్ డివి.నరేష్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపా ధ్యాయ బృందం శాలువాలతో సన్మానించారు. గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు నాలుగో తరగతి శిరీష, రిర్షిత్, సాయిచరణ్, సృజన్, హారిక, వరుణ్, అభిరామ్, నరేష్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, ప్రేమ్ రాథోడ్, వెంకటేష్ రాథోడ్ ఉన్నారు.

### బోరు మోటార్‌కు మరమ్మత్తులు చేయించిన బిఆర్ఎస్ నేత

**మేడ్చల్, మార్చి 31, ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్‌లోని పూడూరు కిష్టాపూర్ డివి జన్ పరిధి పూడూరు గ్రామంలో చెడిపోయిన బోరు మోటార్‌ను బీఆర్ఎస్ నేత వేణు యాదవ్ మరమత్తులు చేయించారు. గ్రామంలోని మజీద్ వద్ద గల బోరుకు స్వంత ఖర్చులు వెచ్చించి నీటి సమస్యను పరిష్కరించడంతో వేణు యాద వ్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**శామీర్‌పేట, మార్చి 31, ప్రభాతవార్త:** బాధిత సింగిర్తి నవనీత కుటుంబానికి సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం మంజూరు కావటంతో చెక్కును జగ్గంగూడ కౌన్సిలర్ సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అందజేశారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని జగ్గం గూడలో సింగిర్తి నవనీతకు వైద్య సేవల కోసం ప్రభుత్వం నుంచి సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఆర్థిక సహాయంగా 55వేల రూపాయలు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుం బానికి చెక్కును అందజేయటం జరిగిందన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు అయి నట్లు ఆ చెక్కును వారికి అందజేశామని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతల పల్లి మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.అనిల్‌రెడినడ, మాజీ వార్డు సభ్యులు జహంగీర్, సుదాకర్, రాంరెడ్డి, సాయి, బాల్‌రాజ్, పాల్గొన్నారు.

## షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం

**షాద్ నగర్, మార్చి 31, ప్రభాతవార్త :** ఎంతోకాలంగా షాద్ నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ కార్యక్రమం త్వరలోనే అధికారులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణ చౌరస్తాలో హెచ్ఎండిఏ శాఖకు చెందిన ఏఈ విశ్వతేజ సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలిం చారు. చౌరస్తా విస్తరణలో భాగంగా సదర్ ప్రాంతాన్ని తిలకించారు. ఈ సందర్భంగా చౌరస్తా విశేషాలను స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, సాదిక్, వీర్లపల్లి మహబూబ్ వారివెంట ఉన్నారు. ఎంతోకాలంగా చౌరస్తా విస్తరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం అయ్యిందని అయితే అన్ని అవసరాలకు అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టబోయే పనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలబడతాయని బసవేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, SANGAREDDY AT SANGAREDDY
O.S.NO. 37 OF 2026

Between:
1) Smt. Aenugula Aruna, W/o Late Aenugula Venkat Reddy, Aged 41 yrs, Occ: Household,
2) Aenugula Harshavardhan Reddy, S/o Late A.Venkat Reddy, Aged 21 yrs, Occ: Student,
3) Aenugula Sai Kiran Reddy, S/o Late A. Venkat Reddy, Aged 16 yrs, Occ: Student,
4) Smt. Aenugula Narsamma, W/o Late A. Penta Reddy, Aged 79 yrs, Occ: Household,
All are R/o H.No. 15-40, Ishkabai, Beeramguda, Ameenpur mandal, Sanga Reddy District ...Plaintiffs
AND
1) The Tahasildar, Ameenpur Mandal, Sanga Reddy Dist.
2) The Tahasildar, Chilipched Mandal, Medak Dist.
3) The Tahasildar, Mominpet Mandal, Vikarabad Dist.
4) All concerned ...Defendants
To,
ALL CONCERNED
The plaintiffs have filed suit for Declaration to declare the plaintiffs are the legal heirs of the deceased Late Aenugula Venkat Reddy, hence you have to appear before the court on 15/04/26 at 10:30 AM., for your appearance, otherwise matter will be decided as per law.
(BY THE ORDER OF THE COURT)
G.L. Sreenivasa Rao
D. Vishal
Advocates
Beeramguda, Sangareddy District
Cell No. 8247295139

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client is intending to purchase the below mentioned schedule of property from its owner viz., Sri BABNEET SINGH KUKREJA. If anybody is having any objection, claim, interest, dispute for the above intended sale transaction, he/she/they may contact the undersigned with the documentary proof substantiating his/her/their objections/claims/details of dispute/s within Seven (7) days from the date of this publication, failing which, my client will proceed to complete the sale transaction with the above owner as if there are no third party claims/objections/disputes in respect of the Schedule Property and thereafter no claims/objections/disputes will be entertained.
SCHEDULE OF PROPERTY: All that Vacant site measuring an extent of 222.97 Sq.mtrs (approx 267 Sq.yds) bearing Plot No. 476 in "GARDEN CITY" layout approved by Hyderabad Metropolitan Development Authority Hyderabad vide Revised Final Layout Permit No. 1/LO/Plg/SHZ/HMDA/2012 Dt:- 28-01-2019 and Final Layout Permit No. 06/LO/plg/SHZ/HMDA/2012 Dt:- 28-11-2018 covered by Survey Nos. 120, 121, 122/p, 126/p, 127/p, 128, 129, 130, 132, 137, 138, 522, 524, 525, 526, 528/p, 529/p, 531, 535, 550/p, 551 & 552/p of Rangapur & Nandigama Village, Nandigama (Mandal), Ranga Reddy District, Telangana within in Shadnagar Sub-Registrar office and bounded by: North By:- Plot No-475, South By:- Plot No-477, East By:- Plot No-469 and West by:- 12 Mtr road.
M. Venkatesh, Advocate
# Flat No-506, Subishi Sapphire Apartments, Mokila (V), Shankarpally (Mandal), Rangareddy District-501203. CELL:+91-9908226869

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT :: AT L.B.NAGAR.
EP.No. 218 OF 2023
IN
O.S. No. 32 of 2011.
BETWEEN:
Ch. Laxmi Narayana Murthy ... Decree Holder.
AND
Smt. K. Malamma W/o. Late K. Narasimha & 5 Others
To
...Judgment Debtors,
1. Smt. K. Venkatamma, W/o. M. Srisailam, D/o. Late K. Narasimha, Aged: 60 years, Occ: Household, R/o. H.No.2-2-18/18/3/3,C-32/8, Flat G-1 Rajagruha Apartments, Durgabai Deshmukh Colony, Near Ahobila Muth Temple Road, Bagh Amberpet, Hyderabad-500 013.
...Judgment Debtor No. 6
Please take notice that the above named Decree Holder has instituted the above E.P. against you, seeking to issue warrant of attachment of immovable properties more fully described in Schedule "A" and "B" Properties to the Petition under Order XXI Rule 54 of C.P.C. and the Property under attachment may be sold under Order XXI Rule 64 of C.P.C. and the Decree Holder be paid the Amount realized from the Sale. Accordingly the Petitioner Schedule Properties "A" and "B" got attached by the Hon'ble Court, further ordered to conduct auction of the above said Petition Schedule Properties "A" and "B" to sell both the items A and B, hence the Hon'ble Court hereby calling the BIDDERS whom so ever interested to participate in the proposed auction to be conducted in the Open Court Hall on 15-04-2026 for the sale of the items "A" and "B". Hence this Publication.
PETITION SCHEDULE PROPERTY-A
All that piece and parcel of the Open Land bearing Plot No.1002, admeasuring an area of 200 Sq yards or 167.23 Sq.Mts in Survey Nos. 618,622,623, 624,625,626,628,629 and 633 Part, situated at A.V. Nagar, III, in TURKAYAMJAL Revenue Village, Previously under Torkayamjal Gram Panchayath, Presently under Turkayamjal Municipality, Previously under Hayathnagar Revenue Mandal, Presently under Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, within the jurisdiction of Registration District, Ranga Reddy District, Registration Sub District, Vanasthalipuram and bounded by (Document No 46-47/2020). NORTH: Plot No. 1003, SOUTH: Plot No 1001, EAST: Plot No. 1013, WEST: 30 Feet Wide Road
PETITION SCHEDULE PROPERTY-B
All that piece and parcel of the Open Land bearing Plot No.1003, admeasuring an area of 200 Sq yards or 167.23 Sq.Mts in Survey Nos. 618,622,623,624, 625,626,628,629 and 633 Part, situated at A.V. Nagar, III, in TURKAYAMJAL Revenue Village, Previously under Turkayamjal Gram Panchayath, Presently under Turkayamjal Municipality, Previously under Hayathnagar Revenue Mandal, Presently under Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, within the jurisdiction of Registration District, Ranga Reddy District, Registration Sub District: Vanasthalipuram and bounded by (Document No.4648/2020):- NORTH: Plot No. 1004, SOUTH: Plot No 1002, EAST: Plot No. 1012, WEST : 30 Feet Wide Road.
"BY THE ORDER OF THE HON'BLE COURT"
Sd/- G.A.PADMANABHA RAO, Advocate.
H.No. 11-12-222, Road No.4, Incoe Tax Colony, Sri Ramakrishnapuram, Hyderabad-500 102. Cell No: 9885836922.

## గర్భిణీకి పురుడు పోసిన 108 సిబ్బంది

**మేడ్చల్, మార్చి 31, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలం పరిధి గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని మునీరాబాద్ గ్రామానికి చెందిన గర్భిణి ఆర్తి కుమారి (22)కి మంగళవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన 108 అంబులెన్స్ వాహనం గ్రామానికి చేరుకుంది. అప్పటికే ఆమెకు పురుటి నొప్పులు అధికమవ్వడంతో ఆస్పత్రికి తరలించే వీలు లేకపోవడంతో వాహన ఈఎంటి సీతారామ్, పైలట్ అశోక్‌లు ఈఆర్‌సీపీ డాక్టర్ స్మితకు ఫోన్ చేసి ఆమె సూచనల మేరకు ఇంటిలోనే పురుడు పోయడంతో ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి బిడ్డను మేడ్చల్‌లోని కమ్యూనిటీ హాస్పిటల్‌కి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లీ బిడ్డను కాపాడినందున ఆర్తీ కుమారి కుటుంబసభ్యులు ఈఎంటి సీతారామ్ మరియు పైలట్ అశోక్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



అంబులెన్స్ వాహనంలో తల్లీ బిడ్డలు

## సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో

సిఎం దిష్టి బొమ్మను దగ్ధం చేసిన ఆశా వర్కర్లు



మేడ్చల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

**మేడ్చల్, మార్చి 31, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని సిఐటియు మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ అన్నారు. మేడ్చల్‌లోని జాతీయ రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు రాస్తారోకో నిర్వహించి సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో పాటు, 7వ హామీగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షి స్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని అన్నారు. రూ.18 వేల వేతనం ఇస్తామన్న హామీనీ అమలు చేయాలని డిమాండ్ చేసిన ఆశా కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించాడు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిందని విమర్శించాడు. ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, అదనపు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పద్మ, వసంత, మండల నాయకులు కృష్ణవేణి, కల్పన, ఫైనాస్, మాదవి, లక్ష్మి ్మ, యాదమ్మ, అతీయ, రేణుక, శ్రీదేవి, సునీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల పెళ్లికి సర్పంచ్ ఆర్థిక సహాయం

**తలకొండపల్లి, మార్చి 31, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన బతికె గెలవమ్మ కూతురు అంజలి వివాహానికి స్థానిక సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్‌లో వ్యక్తిగతంగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం. సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడపిల్ల పెళ్లికి వ్యక్తిగతంగా ఆదుకుంటానని ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం నాడు అవని చెందిన బత్తిక గెలవమ్మ కూతురు అంజలి వివాహానికి వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేసినట్లు ఆమె తెలిపారు. స్థానిక ఉపసర్పంచ్ ఆంజనేయులు వ్యక్తిగతంగా 50 కేజీల బియ్యం అందజేశారు. భవిష్యత్తులో గ్రామానికి మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు మాజీ ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి నాయకులు జానయ్య సునీత కటికల మధు కాకి రాము మీసాల ఆంజనేయులు పాన్ రెడ్డి ముత్యాల నరసింహ బాలయ్య సామెల్ యాదయ్య శేఖర్ భోదాసు నరసింహ శ్రీశైలం మహేష్ యాదవ్ చెన్నయ్య మహేష్ శివ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

**పాలకొండపల్లి , మార్చి 31, ప్రభాతవార్త:** పాలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఉండటంతో అతను చికిత్స నిమిత్తం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నుంచి వ్యక్తిగతంగా పదిహేను వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక సర్పంచ్ బురుజు పుష్పమ్మ అంజన్ రెడ్డిద్వారా తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ హైదరాబాదులోని తన కార్యాలయంలో తన కుమారుడు డాక్టర్ ఉప్పల అఖిల్ చేతుల మీదుగా చికిత్స పొందుతున్న పబ్బతి యాదయ్య కుటుంబానికి రూ.15వేలు వ్యక్తిగతంగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వకుర్తి నియోజకవర్గం లోని అనేక గ్రామాల్లోని పేద ప్రజలకు, వైద్య ఖర్చుల నిమిత్తం పేదవారికి ఉప్పలటస్ నుంచి ఆదుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బురుజు పుష్పమ్మ అంజన్ రెడ్డి, ఉప సర్పంచ్ చప్పరి చంద్రశేఖర్ రాములు యాదయ్య శోభన్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**పరిగి టౌన్, మార్చి 31, ప్రభాతవార్త:** పరిగి మండలం తొండపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు తండ్రి అనారోగ్యంతో మరణించడంతో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహే ష్ రెడ్డి ఆదేశాల మేరకు అంత్యక్రియలకు తొండపల్లి సర్పంచ్ గుర్రంపల్లి కృష్ణయ్య రూ. 5వేలను ఆర్థిక సాయం అందించి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు , లింగ రెడ్డి, చంద్రా ెడ్డి, రఘునాథ్ రెడ్డి నరేందర్ రెడ్డి, ముష్టిపల్లి నర్సింలు, ,హనుమంత్ వెంకటయ్య వార్డు సభ్యులు, అనంతయ్య, రవి సీతారాములు, శంకర్, నవీన్, పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న సర్పంచ్,నాయకులు

## గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

ఎంపిడిఒ సురేందర్‌రెడ్డి

**కోట్‌పల్లి, మార్చి 31, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని 18,గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా ఎన్నికైన 150, మంది వార్డు సభ్యులకు ఈనెల మార్చి 25 నుంచి 31,వరకు కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ సమీపంలో ఉన్న పంక్షన్‌హల్ వార్డు సభ్యులందరికి ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈసందర్బంగా ఎంపిడిఒ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ. గ్రామీణ అభి వృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయతీ రాజ్, వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చిందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడం, నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారం పారిశుద్ధ్య చర్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సభ్యులకు వివరించడం జరిగిందన్నారు. ప్రజలతో సమన్వయం పెంపొందించుకొని పారదర్శకంగా పని చేయాలని సభ్యులకు సూచించడం జరిగిందన్నారు. అనంతరం వార్డు సభ్యులకు సర్టిఫికేట్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రైనర్లు అనంత్ రాజిరెడ్డి, రవి, రవీందర్‌రెడ్డి, మోత్కుపల్లి వార్డు సభ్యులు పి,మాధవరెడ్డి, చాకలి ప్రభావతి, మల్ల ప్రవీణ, ప్రేమ్‌కుమార్, వివిధ గ్రామాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈర్లపల్లిలో 'భూభారతి' రీ-సర్వే అవగాహన సదస్సు

**దౌల్తాబాద్,మార్చి 31,ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం,దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో నేడు అనగా బుధవారం రోజు ఉదయం 10:00 గంటలకు భూభారతి రీ-సర్వేపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గాయత్రి మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీ-సర్వే వల్ల భూ యజమానులకు కలిగే ప్రయోజనాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సమర్పించాల్సిన పత్రాల గురించి ఈ సదస్సులో అధికారులు అవగాహన కల్పిస్తారు. భూ వివాదాల పరిష్కారానికి,స్పష్టమైన హక్కుల కోసం రీ-సర్వే ఎంతో కీలకం.

## మహిళలకు వరప్రదాయిని..ఇందిరా మహిళా శక్తి

**నందిగామ, మార్చి 31,ప్రభాతవార్త:** నందిగామ మండలంలోని మొత్కుల గూడ గ్రామంలో మంగళవారం ఇందిరా శక్తి లో భాగంగా ర్యామ్ లాంబ్ యూనిట్ క్రింద గొర్రె పొట్టేళ్ల యూనిట్ క్రింద రూ. 2 లక్షలు లబ్ధిదారు శ్రీలత కు జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం కింద మంజూరు చేశారు. వీటిని పెబ్బేర్ సంత నుండి 30 గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేసినట్లు ఏటీఎం భగవంతు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మొత్కుల గూడ ఉప సర్పంచ్ నర్సింలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ ,నరసింహులు, వార్డు సభ్యులు పీర్ల రమేష్, ఏదిన హనుమంతు, వి నరసింహులు, జట్టా రమేష్, జట్ట మహేష్, జట్ట అంజయ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు భాగ్యమ్మ, సీసీ అనురాధ, వివోఏ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో ఆకస్మిక తనిఖీలు

**కొత్తూరు, మార్చి 31, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తూరు మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించబడ్డాయి. మండల ప్రత్యేక అధికారి జె. హరీష్ (దీలీదీళీ) ఉదయం 9.00 గంటలకు కొత్తూరు మండల కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయ పనితీరును సమీక్షి ంచారు.తదుపరి మండల అభివృద్ధి అధికారి (లీశిడీవీ), మండల పంచాయతీ అధికారి, ఏఈ , ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో కలిసి పెంజెర్ల గ్రామ పంచాయతీకి వెళ్లారు. అక్కడ ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, పల్లె ప్రగతి డంపింగ్ యార్డ్, నర్సరీలు, గ్రామ పంచాయతీ రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామఅభివృద్ధి పనులు, పరిశుభ్రత, పథకాల అమలు పరిస్థితిపై సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎంపిడిఒ అరుంధతి, పెంజెర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉప సర్పంచ్ శాంతన్ రెడ్డి, కార్యదర్శి గౌస్, వార్డు సభ్యులు వేదాంతాచారి, కటికే మైబుజ్జి, మంద మాధవి, డి శారద, అర్బాస్, ఆర్ రాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నర్సరీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

# అభివృద్ధి లక్ష్యంగా కొత్తూరు మున్సిపాలిటీ బడ్జెట్



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ ,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు,అధికారులు

-కొత్తూరులో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన పురపాలక సంఘం

- 36.51 కోట్ల కేటాయింపు

**కొత్తూరు, మార్చి 31, ప్రభాతవార్త:** కొత్తూరు పురపాలక సంఘం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం మంగళవారం కొత్తూరు పురపాలక సంఘం మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27 సంవత్సరానికి సంబంధించి మొత్తం రూ. 36.51 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో సాధారణ నిధుల నుండి రూ. 7.97 కోట్లు, గ్రాంట్ల రూపంలో రూ. 28.53 కోట్లు ఉండడం గమనార్హం. అభివృద్ధి కార్యక్రమాలకు ఈ బడ్జెట్‌తో మరింత ఊతం లభిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజర్రై, పట్టణ అభివృద్ధికి అవ సరమైన ప్రణాళికలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కమిషనర్ ఎన్ బాలాజీ, కౌన్సిలర్లు పి మాధవి, సి చంద్రకళ, కోస్గి శ్రీనివాస్, వి హేమ దేవేందర్ ముదిరాజ్, కే జయమ్మ, జనార్ధన్ చారి, మాదారం నర్సింహ, బి ప్రసన్నలత యాదయ్య, టౌన్ ప్లానింగ్ అధికారిణి హబీబున్నిసా, మునిసిపల్ ఏఈ నరేష్‌తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హైవే పనులతో వారం భగీరథ బంద్

వేసవిలో నీటి ఎద్దడి అధిగమించాలి

డిప్యూటీ ఆర్డబ్ల్యూఎస్ ఈ ఈ హారిక

**మొయినాబాద్ ,మార్చి 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ బీజాపూర్ రహదారి రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో పైప్లైన్ షిఫ్టింగ్ తో వారం రోజులపాటు మిషన్ భగీరథ నీరు సరపర నిలిచిపోనుంది తద్వారా ఏప్రిల్ మే నెలలో వేసవి ఎండలు అధికంగా ఉండడంతో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ రెండు నెలలు అధికారులు అందుబాటులో ఉండి నీటి ఎద్దడిని అధిగమించాలని ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈ ఈ హారిక అన్నారు మంగళవారం మొయినాబాద్ మండల అభివృద్ధి కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 15 ఏప్రిల్ వరకు గ్రామాల్లో నీటి ఎద్దడిని అధిగమించే సమస్య ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో పాటు పంచాయితీ కార్యదర్శులు గ్రామ సర్పంచ్లతో సమావేశం నిర్వహించారు సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ హారిక మాట్లాడుతూ మండలంలో సమ్మర్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు హైదరాబాద్ బీజాపూర్ హైవే విస్తరణ పనులు జరుగుతుండడంతో ఏప్రిల్ మే రెండు నెలల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందన్నారు హైవే పనుల కారణంగా పైప్ లైన్లు మరమ్మతులు షిఫ్టింగ్ లో జరుగుతున్నందున వచ్చే వారం రెండు వారాలు మిషన్ భగీరథ మొయినాబాద్ మండల్ లో అందకపోవచ్చు అన్నారు ఇది దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు బోర్‌వెల్స్, మోటార్లు, పైపులైన్లను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలని సూచించారు. ఎక్కడైనా నీటి కొరత ఉంటే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. అదేవిధంగా, నీటి వనరులను సంరక్షి ంచడంలో గ్రామస్థుల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. అధికారులు ప్రతిరోజూ పరిస్థితిని పర్యవేక్షి స్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, ఇంజినీర్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్ డిప్యూటీ ఈ మిషన్ భగీరథ సత్యనారాయణ ఏ ఈ మిషన్ భగీరథ ప్రియదర్శిని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వాటర్ మెన్స్ ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆర్డబ్ల్యూఎస్ అధికారులు

# రేడియల్ రోడ్డుకు మా భూములు ఇవ్వలేం

-ఆ భూములే మాకు జీవనాధారం

-షాబాద్ డిప్యూటీ తాసిల్దార్ మధుకు వినతి పత్రం అందజేసిన రైతులు

**షాబాద్, మార్చి 31, ప్రభాతవార్త :** తాతల కాలం నాటి నుండి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములను రేడియల్ రోడ్డు నిర్మాణానికి ఇవ్వలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్కుంట, మాచనపల్లి, బోనగిరిపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ భూములు రేడియల్ రోడ్డులో పోకుండా చూడాలని మంగళవారం షాబాద్ డిప్యూటీ తహసిల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాతల కాలం నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను రేడియల్ రోడ్డు కోసం తీసు కొని, తమ కుటుంబాలను రోడ్డున వేయడం సరికాదన్నారు. తమకు ఉన్న ఎకరం, అరెకరం, రెండెకరాల భూములను రోడ్డు నిర్మాణం పేరిట ప్రభుత్వ లాక్కోవడం, తమ జీవితాలు లేకుండా చేయడమేనని అన్నారు. ప్రభుత్వం తమకు సరైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాలమాకుల రమేష్, కోమటి చంద్రశేఖర్, నర్సింలు, చంద్రబాబు, రవి, శేఖర్, వెంకట్రామన్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ వైర్లను ఢీకొట్టిన కంటైనర్ విద్యుత్ స్తంభం ధ్వంసం

**నందిగామ, మార్చి 31,ప్రభాతవార్త:** నందిగామ మండలం మేక కూడా శివారులో మంగళవారం ఉదయం కంటైనర్ విద్యుత్ వార్లను ఢీకొన్న సంఘటనలో విద్యుత్ స్తంభం ధ్వంసం కావడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. టవర్ కోసం భూమిలో నుండి వైర్లను పంపే సిబ్బందితో మేకగూడ శివారులోకి సల్వేంద్రి కూడా వెళ్లే దారిలో కంటైనర్ వచ్చింది. మేకగూడ పిఏసిఎస్ గోదాం ముందు కాలి స్థలం ఉండడంతో డ్రైవర్ కంటైనర్ మలపడానికి ప్రయత్నిస్తుం డగా పైన ఉన్న విద్యుత్ తీగలు కంటైనర్ తగిలాయి. దీంతో విద్యుత్ స్తంభం ధ్వంసమై మంటలు రేగి విద్యు త్ వైర్లు తెగిపడ్డాయి. ప్రమాద ప్రదేశం లో తడి చెత్త పొడి చెత్త వేరు చేసే షెడ్డు వద్ద కూలీలు పనిచేస్తున్నారు . ప్రమాదంతో భారీ శబ్దం రావడంతో కూలీలు ప్రాణాలను అరిచేతిలో పెట్టు కొని బతుకు జీవుడా అంటూ పరుగులు తీసినట్లు అక్కడున్న ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష ్యంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం సంబంధించిన ఆ ప్రదేశంలోని వారు తెలిపారు. ఈ ప్రమాదంతో చుట్టుపక్కల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ప్రమాద ఘటనను తెలుసుకున్న నందిగామ విద్యుత్ ఏఈ శ్రీధర్ , లైన్ మెన్ రవిలు సంఘటన ప్రదేశాన్ని చేరుకొని, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని కరెంటును పునరుద్ధరించారు.



ప్రమాదంలో ధ్వంసమైన విద్యుత్ స్తంభం.



ప్రమాదానికి కారణమైన కంటైనర్

## రేపు హనుమాన్ జయంతి ప్రత్యేక పూజలు

**షాద్‌నగర్, మార్చి 31, ప్రభాతవార్త :** శివ మారుతి గీతా అయ్యప్ప దేవాలయంలో హనుమత్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 2న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయము 425 నిమిషములకు సుప్రభాత సేవ తదుపరి అఖండ దీపారాధన,515 నిమిషములకు అభయాంజనేయ స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, సింధూర లేపనం, సహస్రనాగవల్లి దళార్చన, మన్య సుక్త హోమం, తదుపరి మహా మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించడం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఏప్రిల్ 2నుంచి పెద్ద ఎత్తున గ్రామ సభలు నిర్వహించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31, ప్రభాతవార్త:** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సిఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్‌లతో కలిసి నగరం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఏప్రిల్ 2నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. డిప్యూటీ సిఎం,సిఎస్ సూచనల మేరకు ఆ తరువాత ఈ సందర్భంగ జిల్లా సంబంధిత అధికారులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, జూన్ 2నుంచి అమలు చేయబోతున్న కొత్త పథకాల గురించి ప్రజలకు గ్రామ సభల్లో వివరించాలని అధికారులకు సూచించారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పథకాల గురించి వివరించాలన్నారు.

### నేటి నుంచి రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ షురూ..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల ద్వారా రేషన్‌కార్డుదారులకు మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యంను బుధవారం (ఏప్రిల్ 1)నుంచి పంపిణీ చేయటం జరుగుతుందని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ జిల్లా మేనేజర్ ఎల్.సుగుణబాయి తెలిపారు. జిల్లాకు సంబంధించి 6,45,442 రే షన్‌కార్డులలో నమోదైన 22,17,063 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి నెలకు 6కిలోల చొప్పున మూడు నెలలకు అవసరమైన 39,360.154మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని 6ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా సన్న బియ్యాన్ని రేషన్‌షాపులకు సరఫరా చేసి అక్కడి నుంచి లబ్దిదారులకు సకాలంలో పంపిణీ చేయటానికి అవసరమైన చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు.

## పెంచుతానన్న పెన్షన్ల హామీ ఎటు పోయింది?

**యాచారం,మార్చి 31, ప్రభాతవార్త:** చేయూత పెన్షన్లు పెంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి సూటి ప్రశ్నిస్తున్నామని వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలో గల వికలాంగుల భవనంలో విహెచ్పిఎస్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య పాల్గొని మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న నేటికీ చేయూత పెన్షన్ దారులకు ఇచ్చిన హామీ నెరవేరలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. జూన్ 2న 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని గుర్తుచేశారు. జూన్ 2న రెండు లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చుడు కాదు, రాష్ట్రంలో నేటి వరకు కొత్త పెన్షన్లకు అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు ఇవ్వాల్సిందే, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే పెన్షన్లు పెంచుతామని చెప్పి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికీ పెన్షన్ల పెంపుపై ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి కంటే తర్వాత అయినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్లు పెంచితే తెలంగాణ ముఖ్యమంత్రి పెన్షన్లు పెంచలేదంటే పెన్షన్ దారుల మీద ఎంత కక్ష ఉందో గుర్తుంచు కోవాల్సిన అవసరం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ముఖ్య మంత్రి నిద్రపోయినట్టుండని గుర్తు చేస్తున్నాము..తెలంగాణ రాష్ట్ర మాత్రం పేద ప్రజలను నట్టేట ముంచే స్థాయిలో ఉందని గుర్తు చేస్తు న్నామన్నారు. ఇప్పటికైనా మాయ మాటలు చెప్పి పెన్షన్దారులను మోసం చేయొద్దని రేవంత్ రెడ్డి కి గుర్తు చేస్తున్నాము. ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే నేటి వరకు అర్హులైనటువంటి కొత్త పెన్షన్దారులకు పెన్షన్లు మంజూరు చేయాలి. అదేవిధంగా పెంచుతానని హామీ ఇచ్చినటువంటి పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, జిల్లా అధ్యక్షులు యాచారం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### యాచారంలో దళిత గిరిజన బహుజన సమైక్య సమావేశం

**యాచారం, మార్చి 31, ప్రభాతవార్త:** యాచారం మండల కేంద్రంలోని వికలాంగుల భవన సముదాయంలో మంగళవారం సిటిజన్స్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సివిఎంసిని ఎన్నిక జరిపారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ డి బి ఎస్ యు పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ అవాకేనింగ్ ల నుండి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జోగు రమేష్ కమిటీని ఉద్దేశించి దేశంలో రాష్ట్రంలో ఎస్సి ఎస్టి బిసి మైనార్టీలు అలాగే ఓ బిసిలుగా ఉన్నటువంటి సామాజిక న్యాయం మహిళల పట్ల భద్రత, భూమి లేని వారికి భూమి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. సి వి ఎం సి కమిటీ ఎస్సి ఎస్టి బిసి మైనార్టీలకు ఎలాంటి అన్యాయం జరిగినా ప్రభుత్వ పరంగా అందవలసిన పథకాలు అందేవిధంగా అలాగే ఎస్సి ఎస్టి చట్టం ప్రతిష్టాత్మకంగా అమలుపరచుటపైన ఈ యొక్క కమిటీ పని చేస్తుందని తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

**మర్పల్లి, మార్చి 31, ప్రభాతవార్త:** భూకమతాలు పక్రమంగా లేకపోవడంతో పలు భూసమస్యలు వస్తున్నాయనీ గుర్తించిన ప్రభుత్వం భూభారతీలో భాగంగా భూములను రీసర్వే నిర్వహించడంజరుగుతుందనీ తహశిల్దార్ పురుషోత్తం తెలిపారు. రీసర్వేలో భాగంగా మండలంలోని వీర్లపల్లి,సిరిపురం,కల్కోడ,కుదుగుంట,నాలుగు గ్రామాలను ముందుగా తీసుకోవడం జరిగిందనీ, అందులో భాగంగా మంగళవారము వీర్లపల్లి గ్రామంలో రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వేనెంబర్ హద్దులను నిర్దారించడంతో గ్రామాలలోభూతగాదాలు ఉండవనీ ఆయన అన్నారు. ఇక ముందు ముందు భూములు అమ్మిన కొన్న సర్వేనెంబర్ ఆధారంగానే కొనడం అమ్మడం జరుగుతుందనీ ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సర్వేయర్‌లలిత,జిల్లా సర్వేయర్, గ్రామ సర్పంచ్ సుక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

-చేవెళ్ల ఎస్ఐ వనం శిరిష సూచన

**చేవెళ్ల, జనవరి 31, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎస్ఐ వనం శిరిష సూచించారు. మంగళవారం చేవెళ్ళ మండలం నాంచేరి గ్రామంలో గ్రామ సర్పంచ్ అశోక్ అధ్వర్యంలో ఆరైవ్ ఆలైవ్‌లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా చేవెళ్ల ఎస్ఐ వనం శిరిష మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. సైబర్ క్రైంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకారించాలన్నారు. ప్రజలను క్షేమంగా ఇంటి చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని నాంచేరి, ఇంద్రారెడ్డినగర్, మిర్జాగూడ, అలూరు స్టేజిలవద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం కూడ ఎక్కువగా జరుగుతుందన్నారు.

## కవిత ఇది నిజమే కదా..?!

**షాద్‌నగర్ టౌన్, మార్చి 31, ప్రభాతవార్త :** ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరుక్కుని జైలు జీవితం అనుభవించిన కవిత ఇప్పుడు తెలంగాణలో సారా దందాలోకి దిగాలని భావిస్తున్నారనీ తెలంగాణ మాజీ సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్, షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రాజా వరప్రసాద్ రావు సంచల వ్యాఖ్యలు చేశారు. ఆయన విడుదల చేసిన పత్రిక ప్రకటన ఈ విధంగా ఉంది.. త్వరలో హైదరాబాద్‌లో ప్రభుత్వం ఇవ్వనున్న మైక్రో బ్రూవరీ లైసెన్సుల కోసం ఇప్పటికే తన వారితో అప్లికేషన్లు వేయించి, దాదాపు 10 మైక్రో బ్రూవరీలు హైదరాబాద్ నగరంలో కవిత భాగస్వామ్యంతో ప్రారంభం కానున్నాయి. కవిత పీఏ శరత్ రావు కనుసన్నల్లో, కవితకు సన్నిహితులు అజయ్ రావు, అజిత్ రావు, ప్రశాంత్ కుమార్ తదితరులకు చెందిన కంపెనీల ద్వారా ఇప్పటికే ప్రభుత్వానికి అప్లికేషన్ల సమర్పణ పూర్తి కాగా, వాటికి అప్రూవల్స్ కోసం కవిత ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు పూర్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తి కాగానే లైసెన్స్ మంజూరు సైతం ప్రారంభం కానుంది. పైన తెలిపిన వ్యక్తులకు లైసెన్సులు రాగానే కవిత తన పీఏ శరత్ మరియు మరో ఇద్దరు సిబ్బంది ద్వారా ఈ భాగస్వామ్యం తీసుకోనున్నారు. ఇప్పటికే పైన వ్యక్తుల పేర్ల మీద నడుస్తున్న మద్యం వ్యాపారం కవిత చేతితోనే ఉండగా ఇపుడు కొత్తగా మైక్రో బ్రూవరీస్ సైతం వారి పేరుతో కవిత చేతిలోకి రానున్నాయని, ఈ విషయం తనకున్న విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారమని మీడియాకు ఈ వివరాలను వెల్లడించారు.

## భూ సేకరణకు సహకరించాలి

**జిల్లెడు చౌదరిగూడ,మార్చి 31,(ప్రభాతవార్త):** రేడియల్ రోడ్డు నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లచ్చంపేట గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను మోసం చేయదని అన్నారు. ప్రభుత్వ పరిహారం రైతులకు అందుతుందని ఆయన పెర్కొన్నారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సరిత, తదితరులు ఉన్నారు.

## పార్టీల కతీతంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తాం

**బంట్వారం, ప్రభాతవార్త :** పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోచారం వెంకటేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 6వ వార్డులో ఎంపి నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే పార్టీలని, మిగతా సమయాల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. పార్టీలకతీతంగా అందరూ కృషి చేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.